

ఇందిరమ్మ ఇళ్లపై రాజకీయ పెత్తనం!

- గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాపై అభ్యంతరాలు
- అధికారులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్న నేతలు, కార్యకర్తలు
- తామే మంజూరు చేయించామంటూ చెప్పుకునే ప్రయత్నం
- మంజూరు పేరిట వసూళ్లకు ఎగబడుతున్న స్థానిక నాయకులు
- జిల్లాలో మొక్కుబడిగా మారిన ఇందిరమ్మ కమిటీల పనితీరు

ఆదిలాబాద్, మే5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంపై రాజకీయ పెత్తనం పెరిగిపోతుందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అర్హులైన నిరుపేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక సర్వేను నిర్వహించింది. దీనాధారంగానే లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్ల మంజూరును చేయాల్సి ఉంటుంది. కానీ అధికార, ప్రతిపక్ష నేతల ఒత్తిళ్లతో ఇందిరమ్మ ఇళ్లు పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం 3500 ఇళ్లను మంజూరు చేసింది. తొలివిడత కింద పూర్తిగా ఇళ్లులేని నిరుపేదలకు మంజూరు చేయాలనే నిబంధనను విధించింది. మొదట 17 మండలాల్లో 17 గ్రామాలను పైలెట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను చేపడుతున్నారు. రాజకీయ పరపతితో కొందరు నేతలు తమ అనుచరులకు ఇళ్లను మంజూరు చేయించుకుంటున్నారనే విమర్శలు లేక పోలేదు. ఇప్పటికే క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం అధికారులు లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు. కొన్ని మండలాల్లో ఇప్పటికే జాబితాను ఫైనల్ చేసి ఆన్ లైన్ ప్రక్రియను పూర్తి చేశారు. అయితే అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. కానీ అంతా మండల, నియోజక వర్గ స్థాయి నేతలదే హవా కనిపిస్తోంది. మొదటి నుంచి అర్హుల జాబితాలో ఉన్న చివరి క్షణంలో తమ పేరును తొలగించారంటూ తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన శేర్ల సుశీల అనే మహిళ కలెక్టర్ రాజర్షిషాకు ఫిర్యాదు చేశారు. కొంత మంది నేతలు కావాలనే ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయలేదంటూ ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలకు ప్రాధాన్యం లేక పోవడంతో నామ్‌కే వాస్తేగా మారిందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

అధికార ప్రతిపక్షాల పోటాపోటీ

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు పోటాపోటీ ప్రయత్నాలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారమే అధికారులు లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేస్తున్న నేతలు, కార్యకర్తల నుంచి తీవ్రమైన ఒత్తిళ్లు వస్తున్నాయి. దీంతో గత్యంతరం లేక మండల స్థాయి అధికారులు అర్హుల జాబితాలను తలకిందులు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాల్లో భిన్నమైన రాజకీయ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ రెండు నియోజక వర్గాలలో బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొనసాగుతున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలు, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. అధికార, ప్రతిపక్ష నేతల ఒత్తిళ్లతో అధికారులు సతమతమవుతున్నారు. అంతా సక్రమంగానే జరుగుతుందని అధికారులు చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నా.. లోలోన మాత్రం తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఒత్తిళ్లను తట్టుకోలేక కొన్ని సందర్భాల్లో మండల స్థాయి అధికారులు సెలవుల్లో వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. మాటవినని అధికారుల అంతుచూస్తామంటూ కొంత మంది నేతలు హెచ్చరికలు చేస్తున్నట్లు సమాచారం. తలమడుగు మండలంలోని సాయిలింగి, దేవాపూర్, తాంసి మండలంలో పొన్నారి, గొట్కూరి, వడ్డాడి, జామిడి, ఇచ్చోడ మండలం కోకస్ మన్నూరు గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల కోసం పలువురు లబ్ధిదారులు రచ్చచేసినట్లు తెలిసింది.

జాబితాలతో ఇంటింటికీ

ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలు ఫైనల్ కావడంతో అధికార, ప్రతిపక్ష నేతలు అర్హుల జాబితాలతో ఇంటింటికి వెళ్తున్నారు. తామే ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయించామంటూ పోటాపోటీగా చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. సోషల్ మీడియాల్లోను లబ్ధిదారుల జాబితాలను వైరల్ చేస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకే మద్దతుగా ఉండాలని సూచిస్తున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా ఉంటేనే ఇందిరమ్మ బిల్లులు సకాలంలో వస్తాయని లేదంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. బోథ్ నియోజక వర్గంలో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు లబ్ధిదారులను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే ఆదిలాబాద్ నియోజక వర్గంలోను కాంగ్రెస్, బీజేపీ నేతల పరిస్థితి అదే విధంగా కనిపిస్తుంది. ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాల్లో మాత్రం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సాఫీగానే కొనసాగుతోంది. చాలా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం వందల సంఖ్యలో దరఖాస్తులు రాగా కేవలం 20 నుంచి 30 లోపే ఇళ్లను మంజూరు చేయడంతో ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

రహస్యంగా వసూళ్లు

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తికావడంతో కొందరు స్థానిక నేతలు రహస్యంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొంత మంది అమాయక లబ్ధిదారులు మధ్యవర్తులను ఆశ్రయించి ఎంతో కొంత ముట్టచెప్పినట్లు తెలుస్తోంది. ఒక్కో ఇందిరమ్మ ఇంటికి పదివేల నుంచి రూ.20వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ, ఇతరాత్ర ఖర్చుల పేరిట ఎంతో కొంత ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అయితే అధికార, ప్రతిపక్ష అనే తేడా లేకుండా అన్ని పార్టీల నేతలు వసూళ్లకు ఎగబడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల మంజూరులోనూ కొంత మంది నేతలు లక్షల రూపాయలను వసూళ్లు చేసి జేబులో వేసుకునట్లు ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ గుట్టుచప్పుడుకాకుండా ఇదేతతంగం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించి అధికారులు భరోసా కల్పిస్తే అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందంటున్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ రూరల్, మే 05 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన దరఖాస్తుదారులు తమ సమస్యలను దరఖాస్తు రూపంలో సమర్పించారు. జిల్లా కలెక్టర్ సేకరిస్తున్న సమస్యలను ఓపికగా విని సమస్య పరిష్కారానికి సంబంధిత అధికా రులకు తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ప్రజావాణిలో 148 దరఖాస్తులు వచ్చాయని, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్, పంచాయతీ, విద్య, రెవెన్యూ, తదితర శాఖల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ప్రజావాణిలో జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టా భూమిగా మార్చండి సారు..

బేల మండలంలోని మసాలా(బీ) గ్రామానికి చెందిన అచ్చవర్ రాజు అనే రైతుకు చెందిన 1.05 ఎకరం భూమి ఆన్‌లైన్‌లో పొరపాటు వల్ల పట్టా భూమి కాస్త అసైన్డ్‌భూమిగా చూపిస్తున్నదని రైతు వాపోయాడు. ఈ విషయమై సంబంధిత అధికారులను కలిసి సమస్య పరిష్కారం కావడం లేదని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ విచారణ చేపట్టి సమస్యను పరిష్కరిస్తానని హామీఇచ్చినట్లు రైతు తెలిపారు.

జిల్లా కలెక్టర్‌కు సన్మానం

ఆదిలాబాద్ : రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షులు కె.కృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల దేశ ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషాను భారతీయ కిసాన్‌సంఘ్ నాయకులు సోమవారం శాలువాతో సన్మానించి పూలతో సత్కరించారు. ఈ సందర్భంగా కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షులు కేతిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున సరిపడ విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే పూర్తి స్థాయిలో అర్హులైన రైతులందరికి రుణమాఫీ చేయాలన్నారు. రబీలో సాగు చేస్తున్న పంటలకు విద్యుత్ సమస్య ఎదురుకాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఆడెపు శ్రీనివాస్, మద్దల ఆశన్న, అద్వాల అనిల్, అశోక్‌రెడ్డి, అనంత్, రమేష్, రామరెడ్డి, భూమారెడ్డి తదితరులున్నారు.

విద్యార్థికి ప్రోత్సాహం..

ఆదిలాబాద్ రూరల్ : ఉన్నతంగా చదవాలనే ఆకాంక్షను కలెక్టర్ రాజర్షిషా విద్యార్థులకు కల్పిస్తున్నారని, ఇందులో భాగంగా ఇటీవల ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించిన స్నేహకు లాంగ్‌టర్మ్ కోచింగ్‌ను అందిస్తున్నారన్నారు. కలెక్టర్ సూచనల మేరకు సోమవారం డీఐఈఓ గణేష్‌జాదవ్ సన్‌రైజ్ హబ్‌లో అమ్మాయికి అడ్మిషన్ ఇప్పించారు. ఈ సందర్భంగా డీఐఈఓ గణేష్ జాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించిన గర్ల్స్ జూనియర్ అమ్మాయి స్నేహను ఇటీవల రెవెన్యూ గార్డెన్‌లో కలెక్టర్ సత్కరించారన్నారు. అయితే ఉన్నత చదువుల కోసం సహకారం అందించాలని విద్యార్థిని కోరడంతో మంచి ఇన్‌స్టిట్యూట్‌ను చూడాలని కలెక్టర్ సూచించారన్నారు. సన్‌రైజ్‌లో కోచింగ్ తీసుకుంటానని విద్యార్థి చెప్పడంతో పూర్తిగా విచారించిన తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు అమ్మాయికి అడ్మిషన్ ఇప్పించడం జరిగిందన్నారు. ఉన్నతంగా రాణించాలని ఈ సందర్భంగా డీఐఈఓ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సన్ రైస్ ఎడ్యుకేషన్ హబ్ అకడమిక్ డైరెక్టర్ రాజ్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ హిమబిందు, ప్రిన్సిపాల్ జియా ఉల్ హాక్ పాల్గొన్నారు.

సదస్సులను పారదర్శకంగా నిర్వహించాలి

జైనథ్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న భూభారతి రెవెన్యూ సదస్సులను అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. సోమవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ పరిధిలోని కోరట, తరోడ(బ), పూసాయి గ్రామాల్లో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను సందర్శించి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ రైతుల భూముల సమస్యలను పరిష్కరించడానికి భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. గతం కంటే ప్రస్తుతం ఈ చట్టం ద్వారా రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించడానికి అప్పీల్ చేసుకోవచ్చని సూచించారు. బోరజ్ మండలంలో మూడు బృందాలుగా ఏర్పాటు చేసి ఈ నెల 5 నుంచి 15వ తేదీ వరకు ఆయా గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు ఇతర ప్రజలు ఈ సదస్సులో భూమ సమస్యలను పరిష్కరించడాన్ని అప్పీల్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా సంయుక్త కలెక్టర్ శ్యామలాదేవి, బోరజ్ మండల తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, ఆదిలాబాద్ ఆర్డీఓ వినోద్‌కుమార్, బోరజ్ ఎంపీడీఓ వేణులతో పాటు బోరజ్ మండల రెవెన్యూ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

బరంపూర్ విద్యార్థిని సన్మానించిన కలెక్టర్

తలమడుగు : మండలంలోని బరంపూర్ గ్రామానికి మాదూరి రమకాంత్ కూతురు మాధురి మల్లేశ్వరి ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయిలో మంచి మార్కులు రావడంతో ఆమెను సోమవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషా శాలువాతో సత్కరించి సర్టిఫికెట్ అందజేశారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు చదువులో మంచి మార్కులు సాధించాలని కోరారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

- పోలీసు అదుపులో భర్త



సుప్రియ మృతదేహం

ఉట్నూర్, మే5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో ఆదివారం రాత్రి అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే... పాత ఉట్నూర్‌కు చెందిన జాడి రాధాకృష్ణ మేస్త్రీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం ఇదే మండలంలోని గంగాపూర్‌కు చెందిన పెరుగు సంజీవ్‌కుమార్తె సుప్రియ (22)తో వివాహం జరిగింది. వీరికి మూడేళ్లపాప ఉంది. రాధాకృష్ణ ప్రతిరోజు తాగి వచ్చి భార్య సుప్రియతో గొడవ పడుతు ఉండేవాడు. ఆదివారం ఇరువురి మధ్య తీవ్ర గలాటా జరిగిందని, సుప్రియ చీరతో ఇంట్లో ఉరివేసుకుని ఉండడం గమనించిన రాధాకృష్ణ కొడవలితో చీరను కోసి ఆమెను దించి బంధువుల ద్వారా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సుప్రియ మృతిచెందినట్లు వైద్య సిబ్బంది తెలిపి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో ఉట్నూర్ ఆసుపత్రి వద్ద ఇరువురి కుటుంబాల మధ్య తీవ్రవాగ్వాదం చోటు చేసుకుంది. ఆసుపత్రి సిబ్బంది రాధాకృష్ణను గదిలో ఉంచి పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా సుప్రియ బంధువులు, తండ్రి సంజీవ్ తన కూతురు సుప్రియను అల్లుడు, వారి ఇంటి వారు కొట్టి హత్య చేశారని ఆరోపించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి తన కూతురును అల్లుడు విపరీతంగా కొట్టాడని, ఆ తర్వాత ఉరివేసి హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఉట్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలిని ప్రశ్నించగా భార్యభర్తల మధ్య ప్రతిరోజు కొట్లాట జరిగేదని, తాగివచ్చి భర్త భార్యను కొట్టేవాడని తెలిపారు. భర్త వేధింపులను భరించలేకే సుప్రియ ఉరివేసుకుని ఆత్మహత్యకు పూనుకుందని, పంచనామ అనంతరం పోస్టుమార్టంకు శవాన్ని పంపించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నీట్ పరీక్ష సరిగ్గా రాయలేదన్న మనస్థాపంతో
ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య



మనోజ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

ఉట్నూర్, మే5 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష సరిగ్గా రాయకపోవడంతో.. తీవ్ర మనస్థాపానికి గురైన ఓ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని ఉట్నూర్‌కు చెందిన విద్యార్థి రాయి మనోజ్(18) ఆదివారం హైదరాబాద్‌లో నీట్ పరీక్ష రాసి.. సోమవారం ఉదయం ఇంటికి వచ్చాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు పరీక్ష ఎలా రాశావని మనోజ్‌ను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలో కఠినమైన ప్రశ్నలు వచ్చాయని, అందువల్ల సరిగ్గా రాయలేదని తల్లిదండ్రులకు తెలిపిన మనోజ్.. ఆ తర్వాత నిద్రపోతానని చెప్పి ఫస్ట్ ఫ్లోర్‌లోని తన గదిలోకి వెళ్లాడు. తల్లిదండ్రులు స్వాతి, గంగాధర్‌లు కింది అంతస్తు గదిలో తమ ఇంటి పనుల్లో ఉండిపోయారు. అయితే పరీక్ష సరిగ్గా రాయకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన మనోజ్.. తన గదిలోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత కొద్ది సేపటికి కొడుకు మనోజ్‌తో మాట్లాడదామని వెళ్లిన తల్లిదండ్రులకు.. ఉరేసుకొని ఉన్న కొడుకుని చూసి కన్నీరు మున్నీరయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మొగిలి తెలిపారు.

నేటి నుంచి పోలీసుల ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్

బోథ్, మే 5 (ఆంధ్రజ్యోతి): బోథ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసుల ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపును మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు సమ్మర్ క్యాంపును నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఏడు సంవత్సరాలు పైబడిన విద్యార్థులకు క్యాంపులో క్రికెట్ యోగ కరాటే వాలీబాల్ కబడ్డీ పైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి : పీవో



గిరిజనుల సమస్యలు వింటున్న పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ పరిధిలోని అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. ఉట్నూర్ మండలం కామాయిపేట్ గ్రామానికి చెందిన భీంరావ్ తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, బోథ్ మండలం సంఫ్వీ గ్రామానికి చెందిన రాజేశ్వరి తనకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టా మంజూరు కల్పించాలని, జైనూర్ మండలం పానపటర్ గ్రామానికి చెందిన ఆత్రంలత తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయంఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసు కోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి దామోదరస్వామి, ఈఈ జాదవ్ తానాజీ, పీహెచ్‌వో గుడిమల్ల సందీప్‌కుమార్, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి



తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి

తలమడుగు, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సుంకిడి తలమడుగు తదితర గ్రామాల్లోని విత్తనాలు ఎరువుల విక్రయ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభ కానున్నందున రైతు సోదరులు విత్తనాలు ఎరువులు కొనుగోలు దుకాణాలకు వస్తారని వారికి నాణ్యమైన విత్తనాలను అందించాలన్నారు. అదే విధంగా రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా విత్తనాలు కొనుగోలు చేసే ముందు గ్రామాల్లో గల వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు. అనంతరం ఆయా దుకాణాలకు సంబంధించిన రిజిస్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

టీబీ నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): టీబీ నివారణ మనందరి బాధ్యత అని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో డీటీసీవో డాక్టర్ సుమలత, ఎస్‌టీఎస్‌లు దేవిదాస్, సుధ, హెచ్‌ఈవో పవార్ రవీందర్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీబీ నివారణ అవగాహన పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశమని పేర్కొన్నారు. హైరిస్క్ ఉన్న వారందరికీ పరీక్షలు నిర్వహించామని, వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి : ఏఎంసీ చైర్మన్



విలేకరులతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ నాయకులు

బోథ్, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృషిచేస్తుందని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్‌లు పేర్కొన్నారు. సోమవారం బోథ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో జొన్నపంట సాగు ఎక్కువగా ఉన్న గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. సోనాల మండల కేంద్రంలో మంత్రి ఆదేశానుసారం మార్క్‌ఫెడ్ అధికారులు జొన్నపంట కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అయితే తమ ప్రభుత్వం రైతులను ఇబ్బందికి గురిచేయకుండా అన్ని విధాలుగా రైతాంగానికి అండగా ఉంటుం దన్నారు. సమావేశంలో సహకార సంఘం డైరెక్టర్ లోలపు పోశెట్టి, గడ్డల నారాయణ, అబూద్, పి.చంటి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజుల పోతన్న, బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటాం : ఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

సోనాల/బోథ్ మే 5 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమ వారం బోథ్ పోలీసుస్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను లోక్‌ఆదాలత్ ద్వారా పరి ష్కారమయ్యేలా చూడాలన్నారు. అలాగే మహారాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు అయిన ఘన్‌పూర్ వద్ద అక్రమ మద్యం గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే పేకాట, మట్కా నిర్వహణ పై దృష్టిసారించాలన్నారు. అలాగే పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితుల పట్ల సక్రమంగా వ్యవహరించి ప్రజలలో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలు పెం పొందించాలన్నారు. అలాగే ప్రజలు ఎటువంటి సహాయం కావాలన్న డయల్ 100ను వినియోగించుకోవాలన్నారు. ఇందులో బోథ్ సీఐ వెంక టేశ్వరరావు, ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

కార్ల్‌మార్క్స్ గొప్ప కమ్యూనిస్టు సిద్ధాంతకర్త

● సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్

ఆదిలాబాద్‌అర్బన్, మే5 (ఆంధ్రజ్యోతి):కార్మికుడి శ్రమను దోచుకునే పెట్టుబడిదారి విధానం గుట్టురట్టు చేసిన మహానీయుడు కార్ల్‌మార్క్స్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. సోమవారం కార్ల్‌మార్క్స్ జయంతి వేడుకలను సీపీఎం పార్టీ కార్యాలయం సుందరయ్య భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ ప్రపంచ కార్మికులారా ఏకం కండి పోరాడితే పోయేది లేదు బానిస సంకెళ్లు తప్ప అని 150 ఏళ్ల కిందనే నినాదమిచ్చిన గొప్ప కమ్యూనిస్టు సిద్ధాంత కర్త కార్ల్ మార్క్స్ అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంకరాఘవులు, సీనియర్ నాయకులు బండిదత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, పూసంసచిన్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, ఆర్.సురేందర్, బొజ్జఆశన్న, ఎస్.స్వామి, నాయకులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని బీజేపీ వినతి

తాంసి, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికే ముందుగా కేటాయించాలని బీజేపీ మండల శాఖ కోరింది. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం తహసీల్దార్‌కు, ఎంపీడీవోలకు అందజేశారు. అర్హులు అయిన వారిని పక్కన పెట్టి అనర్హులకే కాంగ్రెస్ నాయకులు ఇల్లు కేటాయించడం సమంజసం కాదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్‌రెడ్డి, విలాస్, పరమేశ్వర్, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

'పాకిస్థానీయులను గుర్తించి తరలించాలి'

ఉట్నూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ జాతీయులను పంపించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు సోమవారం ఉట్నూర్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్‌కు మండల బీజేపీ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్‌ల ఆధ్వర్యంలో మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజన మోర్చా జాతీయ నాయకులు గుగులావత్ శ్రీరామ్‌నాయక్ మాట్లాడుతూ ఉట్నూర్ మండలంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న చెల్లుబాటు అయ్యే పత్రాలు లేని, గడువు ముగిసిన వీసాలు కలిగి ఉన్న లేదా వీసాలు సస్పెండ్ అయిన పాకిస్తాన్‌జాతీయులు అందరిని వెంటనే గుర్తించి వారి వివరాలను ఆలస్యం చేయకుండా జాబితా తయారు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎం పీపీ ఆడే దస్‌లాల్‌నాయక్, మాజీ వైస్‌ఎంపీపీ దావులే బాలాజీ, మాజీ ఎంపీటీసీ కందుకూరి రమేష్, నాయకులు బొడ్డుకిరణ్ పాల్గొన్నారు.

రెండురోజుల పాటు జొన్న పంట కొనుగోలు వాయిదా

బోథ్, మే 5 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ కమిటీ ఆవరణలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న జొన్న పంట రెండు రోజులపాటు తాత్కాలికంగా కొనుగోలు చేప ట్టామని సెంట్రి ఇన్ చార్జి గోలి స్వామి తెలిపారు. ఆరోతేదీ నుంచి కొనుగోలు నిలిపి వేసి తిరిగి షెడ్యూల్ ప్రకారం ఎనిమిదో తేదీ నుంచి కొనుగోలు చేపడతామన్నారు. జొన్న పంట నిల్వలు అధికంగా ఉండడం వల్ల ఈ నిర్ణయం తీసుకుంటామన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

నేరడిగొండ : పీఏసీఎస్‌లో రెండు రోజుల పాటు తాత్కాలికంగా జొన్నల కొనుగోలును నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇంచార్జి నాగభూషణం వెల్లడించారు. జొన్నలు అధిక మొత్తంలో నిల్వ ఉండటం, వాతావరణంలో మార్పుల కారణంగా ఈనెల 6, 7వ తేదిల్లో కొనుగోలును నిలిపివేస్తున్నట్లు తెలిపారు. తిరిగి ఈనెల 8 నుంచి షెడ్యూల్ ప్రకారం యదావిధిగా కొనుగోలు చేపడతామని స్పష్టంచేశారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది : మాజీ ఎంపీ


రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ

బోథ్, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి గింజను చివరి వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని ఈ విషయంలో రైతులు ఆందోళన పడవద్దని మాజీ ఎంపీ సోయం బాపూరావు పేర్కొన్నారు. సోమవారం మార్కెట్ యాడ్ ఆవరణలో కరీంనగర్ జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్‌కట్ చేసిన అనంతరం మార్కెట్ యార్డులో పంట కొనుగోలును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పంట తడిసిపోయిందని ఆందోళన చెందవద్దని తడిసిన గింజను సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఈ విషయంలో ఎలాంటి అనుమానాలు పడవద్దు అన్నారు. కొనుగోలును వేగవంతంగా పూర్తి చేశామని అన్ని రకాల వసతులు ఉంటే ఒకటి రెండు రోజుల్లోనే పంటను కొనుగోలు చేస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు అండగా ఉంటారని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేర్చడం జరుగుతుందని పేర్కొన్నారు. కాగా సత్తు మల్లేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సహకార సంఘం డైరెక్టర్ జి.రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పి.చంటి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ నాజర్, అహ్మద్, ఉమేష్, బద్దం పోతారెడ్డి, గాజుల పోతన్న తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఉట్నూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా ఆసుపత్రి ఎదుట ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ నల్ల రిబ్బన్లు ధరించి నిరసన, ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్ బొంకంటి ఆధ్వర్యంలో సోమవారం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మూడునెలలుగా వేతనాల విడుదల చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొంకంటి సుభాష్ మాట్లాడుతూ సకాలంలో వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భానుప్రసాద్, అమర్‌సింగ్, వెంకటేశ్, మోహిన్, అరుణ్, గంగాధర్, వీణ, యశోధ, రమ, దీప, అంజలి, ఆసుపత్రి ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం మహిళల నిరసన


ఆందోళన చేస్తున్న మహిళలు

నార్నూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి (హెచ్) గ్రామానికి చెందిన పేదమహిళలు ఇండ్ల కోసం సోమవారం మండలం పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కనీసం అధికారులు వారిని పట్టించుకోలేదు. కొన్నిగంటల సేపు ఆగి చివరికి వారు తిరిగి ప్రయాణమయ్యారు. ఇప్పటికైనా తమ సమస్య పరిష్కారం చేయకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గైక్వాడ్ చాబాబాయి, దుర్గే పం చపులా బాయి, జాదవ్ ప్రత్యూష, రాథోడ్ శారద పాల్గొన్నారు. మరోవైపు మండలకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ పక్కన వారం రోజుల నుంచి గేదె మృతిచెంది పురుగులు పడి చెడు వాసన వస్తుంది. సంబంధింత అంశాలపై గ్రామపంచాయితీ సెక్రటరీ, ఎంపీడీవో అధికారికి కాలనీ వాసులు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రాంతవాసులు వాపోతున్నారు.

సీఐటీయూ ఆందోళన

ఉట్నూర్, మే 5(ఆంధ్రజ్యోతి): సకాలంలో వేతనాలు చెల్లించని జిల్లా కో-ఆర్డినేటర్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. గత 9 నెలలు గడిచినా వేతనాలు చెల్లించని అనంత ఈ సొల్యూషన్ విద్యాంజలి 2.0 సంస్థపైన, జీతాలు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్న సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్లపై చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని కలిసి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపలరంజిత్‌కుమార్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ గిరిజన పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో 2024 సంవత్సరంనందు అనంత ఈసొల్యూషన్ విద్యాంజలి 2.0 ద్వారా ఈ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్లు జిల్లాలోని కొంత మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రతినెల క్యాటగిరి వారీగా 10 వేల నుంచి 18వేల జీతం తమ సంస్థ ద్వారా చెల్లిస్తామని చెప్పి, వారి వద్ద డబ్బులు తీసుకొని ఆయా పాఠశాలల్లో హాస్టళ్లలో వాచ్‌మెన్ అటెండర్ ఆఫీస్ సబార్డినేటర్ ఇంగ్లీష్ టీచర్ పీఈటీ ఇలా విధులు నిర్వహించాలని వారికి ఆ సంస్థ ఆర్డర్ కాపీలు ఇచ్చారన్నారు. చివరికి సంస్థ ద్వారా పనిచేస్తున్న ఈ వర్కర్లకు 9 నెలలు గడిచినా సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్లు ఇప్పటి వరకు ఒక్క నెల జీతం కూడా ఇవ్వలేదన్నారు. జీతం గురించి సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్లకు ఫోన్లు చేస్తే 15 రోజులు 30 రోజులు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు కాని జీతం మాత్రం చెల్లించడం లేదని తాము ఇన్ని రోజులు ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ గిరిజన పాఠశాల, సంక్షేమ హాస్టల్లో విధులు నిర్వహించామని, ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి స్పందించి అనంత ఈ సొల్యూషన్, విద్యాంజలి 2.0 సంస్థ వాళ్లు తమకు ఇచ్చే పెండింగ్ వేతనాలను ఇప్పించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో అంబటి లక్ష్మణ్, సీఐటీయూ నాయకులు, స్వామి, గంట నరేష్, ఎస్టీ హాస్టల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష కార్య దర్శులు, జిల్లా కమిటీ సభ్యులు స్వరూప సాయిరాణి, సువర్ణ, రాజేశ్వరి, ప్రశాంతి, రాజమౌళి, రమ్య, ఆసిఫాబాద్ జిల్లా నుంచి సంజు, యాదవ్‌రావు, సుజాత, సునిత పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

బార్ అసోసియేషన్ సంతాపం


ఉట్నూర్ కోర్టులో మౌనం పాటిస్తున్న సభ్యులు

ఉట్నూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతిచెందిన హైకోర్టు న్యాయాధికారిని ప్రియదర్శిని గుండెపోటుతో మృతిచెందిన సీనియర్ న్యాయవాది పి.నారాయణల మృతిపట్ల ఉట్నూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టులోని బార్ హాల్‌లో సోమవారం న్యాయవాదులు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి, సీనియర్ న్యాయవాది జమీర్‌ఖాన్‌లు మాట్లాడుతూ నారాయణ ఉట్నూర్ కోర్టులో చేసిన న్యాయ సేవలను కొనియాడారు. మంచిర్యాలలో కోర్టు ఏర్పాటుకు ఆయన కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. కార్యక్ర మంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.జైవంత్‌రావు, న్యాయవాదులు ధీరజ్ గుప్తా, పెందూరుప్రభాకర్, గిరిశ్రీనివాస్, వసంత్‌రావు, కుడెల్లి అశోక్, నాతరిరాజు, వినోద్‌లక్ష్మినారాయణ, అజహర్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ నర్సరీలో పనిచేస్తున్న చిన్నారి

నార్నూర్, మే 05 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల చేయాల్సిన పనులను అధికారుల నిర్లక్ష్యంతో నర్సరీలో అభం శుభం తెలియని చిన్నారి చేస్తున్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న నర్సరీలో ఉదయం పూట మొక్కలకు ఓ చిన్నారి పైపు ద్వారా నీళ్లు పోస్తుంది. పక్కనే బావి, కుంట ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ చూడాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఉపాధి హామీ, గ్రామ పంచాయతీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

భర్త వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు

ఉట్నూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీర్సాయిపేట గ్రామానికి చెందిన ఎల్ల సునంద పెళ్ల చేసుకున్న భర్త వేధిస్తున్నాడని, మరో మహిళతో సహజీవనం సాగిస్తూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నందున తనకు న్యాయం చేయాలని ఉట్నూర్ పోలీసులను ఆశ్రయించింది. జన్నారం మండలం రేండ్లగూడ గాంధీనగర్‌కు చెందిన భూమేష్ తనను ఎనిమిదేళ్ల క్రితం పెళ్లి చేసుకుని బతుకు దెరువు కోసం ముంబైకి తీసుకు వెళ్లాడని, అక్కడి నుంచి ఇక్కడికి వచ్చాక గత కొన్ని రోజులుగా ఓరిస్సాకు చెందిన అమ్మాయితోఫోన్ ద్వారా పరిచయం చేసుకుని ఇంట్లోకి తెచ్చుకుని ఉంటున్నారని, తనకు ఎందుకు అన్యాయం చేస్తున్నావంటూ ప్రశ్నిస్తే తనను హింసిస్తున్నాడని ఈ విషయమై ఉట్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశానని, తనకు న్యాయం చేయాలని వేడుకుంటుంది. ఈ విషయమై సీఐని ప్రశ్నించగా బాధితురాలితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని సీఐ మొగిలి తెలిపారు.

'ఉగ్రవాదాన్ని అణిచివేయాలి'

జైనథ్, మే5(ఆంధ్రజ్యోతి):భారతదేశంలో ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో అణిచి వేసేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని బీజేపీ జైనథ్ మండల నాయకులు అగ్గు మనోజ్‌యాదవ్ అన్నారు. సోమవారం జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ బీజేపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఫహల్గాం ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారికి శ్రద్ధాంజలి ఘటించారు.

అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీయులను వెనక్కి పంపండి

● నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ ● మండల కేంద్రాల్లో తహసీల్దార్‌కు వినవి పత్రాలు అందజేసిన బీజేపీ మండల నాయకులు


వినతిపత్రం అందజేస్తున్న రితేష్ రాథోడ్


ఖానాపూర్ తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ


కడెం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్ కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీలను వెనక్కి పంపాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చెల్లుబాటులేని పత్రాలు, గడువు తీరిన వీసాలు గల పాకిస్తానీలను గుర్తించి వారి దేశానికి పంపించాలన్నారు. పహల్గాంలో క్రూరంగా దాడి చేసి 26 మంది ప్రాణాలు పొట్టన పెట్టుకున్న సంఘటన పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే చర్యలు ఉపేక్షించవద్దని కోరారు. ప్రధానిమోదీ ఉగ్రవాదులను ఏరి వేయాలన్న దృఢ సంకల్పించారన్నారు. దీర్ఘకాలిక వీసాలు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అంజుకుమార్‌రెడ్డి, రాంనాథ్, శ్రావణ్ రెడ్డి, ఆకుల కార్తీక్, సాయి, రచ్చ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ చొరబాటు దారులను తరిమి వేయాలి'

నిర్మల్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్, పాకిస్తాన్ అక్రమ చొరబాటు దారులను తరిమి వేయాలని జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలు అన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం సోమవారం రూరల్ మండల కేంద్రంలో స్థానిక తహసీల్దార్ సంతోష్‌కి పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల నుండి భారతదేశంలోకి అక్రమంగా చొరబడిన రోహింగ్యాలను గుర్తించి వెంటనే వారిని వారి వారి దేశాలకు పంపి వేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి లవకుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులు నర్సారెడ్డి, నాయకులు రాజేందర్, శ్రావణ్ పాల్గొన్నారు.

పాకిస్థానీలను వెంటనే పంపించివేయాలి

ఖానాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : పాకిస్తాన్ అక్రమ వలసదారులను భారతదేశం నుంచి వెంటనే పంపించాలని ఖానాపూర్ మండల బీజేపీ శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్‌ల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు బొప్పారం సత్యవతి, సీనియర్ నాయకులు నల్ల రవీందర్‌రెడ్డి, తోకల బుచ్చన్న, నాయిని సంతోష్, చిలుకూరి తిరుమలగిరి, అనిల్‌రావు, కొండవేణి రమేష్, బట్టు వరుణ్, తుప్ప రమేష్, మాదాసు మురళి, జెట్టి సురేందర్, ఆసం సాయి, సి. భూమా గౌడ్, దూస గంగరాజం, కాలేరి రాజేందర్, కొప్పుల భీమేష్, ఎలిగిటి వెంకటేష్, పంబాల ప్రశాంత్, కత్తుల శ్రీకాంత్, బి. సుమంత్, గైని రాజ్ కుమార్, ఎస్. రమేష్, మంగ్లారపు మహేందర్, కరిపే రాజ్ కుమార్, కట్ట రాజేందర్, డి. వెంకటేష్, అలిశెట్టి కార్తీక్, అడిదెల మహేష్, సి. చంద్రశేఖర్, ఎం. భీమన్న, తదితరులున్నారు.

కడెం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

కడెం, మే 5 (ఆంధ్రజ్యోతి) : పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల నుండి భారత దేశంలోకి అక్రమంగా చొరబడిన రోహింగ్యాలను గుర్తించి మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారిని వారి దేశాలకు పంపివేయాలని కడెం బీజేపీ మండల అధ్యక్షులు కాశవేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, నల్లగొండ, కృష్ణ, రమణరెడ్డి, భూమన్న, శ్రీను, శ్రీరామ్, కొండయ్య, ముక్కెర గంగాధర్, దిరాజ్, రాజేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాకిస్థానీలను గుర్తించి వెనక్కిపంపాలి

మామడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఉన్న పాకిస్తానీలను గుర్తించి వారి దేశానికి పంపించాలని మామడ తహసీల్దార్ కార్యాలయంలో మామడ బీజేపీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. భారతదేశంలో వివిధ గ్రామాలలో నివసిస్తున్న చెల్లుబాటు అయ్యే పత్రాలు లేని, గడువు ముగిసిన వీసాలు కలిగి ఉన్న లేదా వీసాలు సస్పెండ్ చేయబడిన పాకిస్తాన్ జాతీయులందరినీ గుర్తించి పాకిస్తాన్ దేశానికి పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన కీలకమైన, తీవ్రమైన అంశం కావునా పాకిస్తానీ జాతీయులను, రోహింగ్యాలను గుర్తించి చట్టపరమైన చర్యలను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాపురెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వరరావు, పవన్, నరేందర్‌రెడ్డి, పోతరాజు శ్రీనివాస్, ఎల్‌వీ రమణ, మల్లయ్య, అశ్విన్ రెడ్డి, హేమ్లానాయక్, భాస్కర్, ఆశన్న, శ మంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోన్‌లో..

సోన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ తెలంగాణ రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల నుండి భారతదేశంలోకి అక్రమంగా చొరబడిన రోహింగ్యాలను గుర్తించి వెంటనే వారిని వారి వారి దేశాలకు పంపించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలో స్థానిక తహసీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, మామిడాల సంతోష్, సుంచు సవీన్, గడ్డం నర్సయ్య, మస్కాపురం పోశెట్టి, సొన్నపేట గంగారెడ్డి, పెసరి గణేష్, చిలుక సాయినాథ్, జనతా నర్సయ్య, పెద్దోళ్ల నరేష్, పత్తిరాజ్, పోశెట్టి, అన్వేష్, రవి, సురేష్ పాల్గొన్నారు.

పెంబి మండలకేంద్రంలో..

పెంబి, మే 5 (ఆంధ్రజ్యోతి) : పాకిస్తానీలను గుర్తించి పాకిస్తాన్ పంపించాలని బీజేపీ మండల అధ్యక్షులు ఐదు వెంకటేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ మద్దతుతో ఆశ్రయం పొందిన ఉగ్రవాదులు 2025 ఏప్రిల్ 22న కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో క్రూరమైన దాడికి పాల్పడడంతో 26 మంది అమాయక పౌరుల ప్రాణాలు బలిగొన్న ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని దేశ ప్రజల్లో తీవ్ర ఆవేదన వ్యక్తం అవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులపై మునుపెన్నడూ లేని విధంగా కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రిత్వశాఖ ఉత్తర్వులు నెంబర్ 25022/2025-ఎఫ్ ప్రకారం, ఫారినర్ యాక్ట్ 1946లోని సెక్షన్ 3(1) ప్రకారం పొందిన అధికారులను ఉపయోగించి పాకిస్తానీ దీర్ఘకాల పౌరులకు వీసా నిలిపి వేయాలని నిర్ణయించిందన్నారు. జాతీయభద్రతకు సంబంధించిన కీలకమైన, తీవ్రమైన అంశం కావునా పాకిస్తానీ జాతీయులను, రోహింగ్యాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెంబి బీజేపీ మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు పుప్పాల రవి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు కే. బాపురావు, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ నర్రా కృష్ణారెడ్డి, కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ చింతకింది రాజేందర్, జి. రాజేశ్వర్, ఎస్టీ మోర్చా నాయకులు లావుడ్యా నగేష్, ఎస్. మహేందర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోహింగ్యాలను తరలించాలని వినతి

ముథోల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుండి అక్రమంగా భారతదేశంలోకి చొరబడి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రోహింగ్యాలను వెంటనే దేశం నుంచి వారిని వెళ్లగొట్టాలని బీజేపీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ముథోల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్‌కు మండల బీజేపీ అధ్యక్షులు కోరి పోతన్న ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు వినతిపత్రంను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయినాథ్, సంతోష్, మోహన్, విజయ్, సాయి, తదితరులున్నారు.

పాకిస్తాన్ ప్రజలుంటే చర్యలు తీసుకోండి

తానూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎవరయిన పాకిస్తాని ప్రజలుంటే వారి గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పుండ్రు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో పాకిస్తానిలు ఉంటే వెంటనే గుర్తించి వారి జాబితా రూపొందించి, వెంటనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యాతాళం చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ మారుతి, శికరప్ప, నరసింహులు, సోమనాథ్, నాగేష్, నరేష్, సాయినాథ్, గజానంద్, మాధవ్‌పటేల్, కార్యకర్తలున్నారు.

చొరబాటు దారులను దేశం నుంచి తరిమివేయాలి

కుంటాల, మే, 5 : (ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్, బంగ్లాదేశ్ రోహింగ్యాలు అక్రమ చొరబాటును ఆపి వారిని రాష్ట్రం నుండి తరిమివేయాలని భారతీయ జనతాపార్టీ మండల బాధ్యులు పసుల నవీన్ అన్నారు. బీజేపీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రం కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నరేష్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతేగాకుండా తమ తమ గ్రామాల్లో అనుమానస్పదంగా ఉన్న వ్యక్తులను ప్రతి పౌరుడు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కట్టరవి, మండల నాయకులు అప్క గజ్జారాం, సూర్యవంశీ సాయినాథ్, ప్రభాకర్, గోవర్ధన్, సిందే దిగంబర్, గజానంద్, ప్రశాంత్, బాజీరావు, వెంకట్ రావు, సాయి, మహేందర్, పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు.



జస్టిస్ ప్రియదర్శిని మరణం

న్యాయ వ్యవస్థకు తీరని లోటు

● ఖానాపూర్ బార్ అసోసియేషన్



ఖానాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హైకోర్టు జస్టిస్ ప్రియదర్శిని అకాల మరణం న్యాయవ్యవస్థకు తీరని లోటు అని ఖానాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మంత్రరాజం సురేష్ అన్నారు. సోమవారం ఖానాపూర్ బార్ అసోసియేషన్ ధ్వర్యంలో బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన జస్టిస్ ప్రియదర్శిని సంతాపసభలో సురేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఖానాపూర్ కోర్టు మంజూరిలో జస్టిస్ ప్రియదర్శిని కృషి మరువలేనిదన్నారు. అనంతరం న్యాయవాదులంతా రెండు నిమిషాలు మౌనం పాటించి జస్టిస్ ప్రయదర్శినికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి. రాజలింగం, న్యాయవాదులు గుగ్లావత్ కిషోర్ కుమార్, కల్వకుంట్ల వినయ్, షేక్ అంజర్, సిలివేరి వేణుగోపాల్, భూమి రవి కుమార్, ఎండీ సలీంఖాన్, ఎర్ర రవికుమార్, రాపెల్లి రాజు యాదవ్, తదితరులున్నారు.

8న హైదరాబాద్‌లో జరిగే

రైతు ధర్నాను విజయవంతం చేయండి

● పోస్టర్ల విడుదల కార్యక్రమంలో ఏఐయూకేఎస్ నాయకుల పిలుపు

ఖానాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు రైతు కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఏఐయూకేఎస్ ఆల్ ఇండియా జాతీయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతు ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు అంకుష్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని జిల్లేడు కుంట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి ఈ ధర్నాకు రైతులు, రైతు కూలీలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు అన్నిరకాల పంటలకు ఎంఎస్పీ ధరను చట్టబద్ధం చేయాలని, చిన్న సన్నకారు, మధ్యతరగతి రైతులకు పూర్తి రుణమాఫీ చేయాలని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పరస్పర సుంకాలకు లొంగొద్దని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లును, నూతన వ్యవసాయ మార్కెట్ చట్టాలను రద్దు చేయాలన్నారు. ఉపాధి కార్మికులకు 200 రోజులు పని కల్పించి రోజువారీ కూలీ 600లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఎన్నో సమస్యలపై నిర్వహించనున్న ఈ ధర్నాకు జిల్లా నుంచి రైతులు, రైతు కూలీలు వివిధ రైతు సంఘాల నాయకులు భారీగా హాజరుకావాలని కోరుతూ గోడ ప్రతులను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు గెడం చందు, పి.మోహన్, శంకర్, సుందర్, దేవరావు, నాగరావు, గగూర్ రాజేష్, తదితరులున్నారు.

నిర్మల్ జిల్లాలో మిశ్రమ వాతావరణం

● జిల్లా కేంద్రంలో ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు

● పలుచోట్ల భానుడి భగభగలు

నిర్మల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం మిశ్రమ వాతావరణం నెలకొంది. జిల్లాకేంద్రం సహా పలు మండలాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. మరోపక్క పలు మండలాల్లో భానుడు తన ప్రతాపాన్ని ప్రదర్శించాడు. ఎండ తీవ్రతకు జనం ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో సోమవారం 40.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవడంతో జిల్లాలో ఆరెంజ్‌అలర్ట్ కొనసాగుతోంది. పంటలు చేతికి అందిన వేల వాతావరణంలో వస్తున్న మార్పులతో అన్నదాతల్లో కలవరం మొదలైంది. ఈ చిరుజల్లులు భారీ వర్షంగా మారితే రైతన్నకు తీవ్ర నష్టం వాటిల్లనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని వరుణుడి బారి నుండి రక్షించుకునేందుకు రైతులు నానా తిప్పలు పడుతున్నారు. మొత్తానికి జిల్లాలో నెలకొన్న మిశ్రమ వాతావరణంలో తీవ్ర ఉక్కపోత జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది.


విద్యార్థులతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా

'ఆరోగ్య పాఠశాల'ద్వారా విద్యార్థుల్లో ఎన్నో మార్పులు

● ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఎన్నో మార్పులు వచ్చాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే పదో తరగతి ఫలితాల్లో జిల్లా 15వ స్థానం నుంచి 9వ స్థానంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. అందరి సహకారంతో జిల్లా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 97.18 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 9వ స్థానం నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సన్మానించి, అభినందించారు. టాపర్‌గా నిలిచిన విద్యార్థులు మాట్లాడుతూ కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలుపుతూ వారి గోల్స్‌ను వివరించారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్, డీఐఈఓ గణేష్, వెల్ఫేర్ హాస్టల్ ప్రిన్సిపల్స్ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: సీఐ


విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పిస్తున్న ఉట్నూర్ సీఐ

ఇంద్రవెల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక జడ్పీఎస్ఎస్ పాఠశాల ఆవరణలో పోలీసు మీ కోసం పోలీసు సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని స్థానిక ఎస్సై సాయన్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యోగా ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచి యోగా ఆసనాలు అలవరిస్తే అద్భుత ఫలితాలు సాధిస్తారని, యోగా చేయడం వలన శారీరక ఆరోగ్య, మానసిక ప్రశాంతత, మంచి పర్సనాలిటీ డెవలప్‌మెంట్, నాలెడ్జ్, ఒత్తిడి రహిత జీవితం, సంపూర్ణమైన ఆరోగ్యం యోగా ద్వారానే లభిస్తుందన్నారు. ఇందులో వివిధ పాఠశాల చెందిన విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ప్రశాంతత

● నార్నూర్ సీఐ రహీమ్ పాషా

నార్నూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో విద్యార్థులకు ఆట విడుపుగా సమ్మర్ క్యాంప్ ద్వారా చెడు అలవాట్లకు, వ్యసనాలకు అలవాటు కాకుండా ఉండడానికే పోలీసుల ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు పెట్టడం జరిగింది అని నార్నూర్ సీఐ రహీం పాషా అన్నారు. సోమవారం మండల కేంద్రం లోని ఏకలవ్య కళాశాలలో పోలీస్ వారు నిర్వహించిన సమార్ క్యాంపునకు స్థానిక ఎస్సై కె.అఖిల్ రిబిన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటల వల్ల పిల్లలకు విద్యార్థిని విద్యార్థులకు మానసిక శారీరక ధృఢత్వం లభిస్తుందని తెలిపారు. సమ్మర్ క్యాంపు ద్వారా అన్ని రంగాల్లో సరైన శిక్షణను అందించడం జరుగుతుందని తెలిపారు. సమ్మర్ క్యాంపు లో పోలీసుల ఆధ్వర్యంలో యోగ, కరాటే, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బాస్కెట్ బాల్, పీఈటీ తోపాటు సమ్మర్ క్యాంపులో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వారి వెంట పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇంద్రవెల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009-10 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారి జ్ఞాపకాలను విద్యార్థులతో ఉపాధ్యాయులు పంచుకున్నారు. విద్యార్థిని, విద్యార్థులు వారు చదువుకున్న రోజుల్లో కొన్ని సంఘటనలను గుర్తు చేసుకుని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోడికే మలింద్, ప్రశాంత్, దినేష్, ప్రవీణ్, దిలిప్, రాహుల్, నరేష్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉప కేంద్రాలు.. సమస్యలకు నిలయాలు

● గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో నానా అవస్థలు

కుభీర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని విద్యుత్ ఉప కేంద్రాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. దీంతో ఒక వైపు సిబ్బందికి, మరో వైపు వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని ఉప కేంద్రాల్లో సౌచాలయాలు సక్రమంగా లేక పోవడం మరో చోట సిబ్బంది గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఉప కేంద్రాల వద్ద యాడ్‌లైట్లు సక్రమంగా లేక రాత్రిళ్ల సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రాలు శిథిలావస్థకు చేరింది. గదుల్లో ఫ్లోరింగ్‌కు కుంగిపోయి పడుకోవడానికి ఆపరేటర్లు, ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 1990 సంవత్సరంలో ఈ ఉప కేంద్రం ఏర్పాటు చేశారు. సిబ్బంది ఉండే గది కిటికీలు పగుల్లు తేలిపోయాయి. గది గోడలు పగుళ్ల తేలిపోవడంతో వర్షాకాలం విషసర్పాలు తేళ్ల గదుల్లోకి వచ్చిన ఎన్నో సందర్భాలున్నాయి. సౌనారి ఉప కేంద్రం కిటికీలు పగిలి పోవడం కారణంగా అక్కడి ఆపరేటర్లు అట్టముక్కలను ఏర్పాటు చేసుకున్నారు. రాత్రిళ్ల పని చేస్తే సిబ్బందికి దోమల బెడద తీవ్రంగా ఉంది. నీటి సౌకర్యాలు ఉన్న శౌచలయాలు, మరుగుదొడ్లు సరిగా లేవు. కుభీర్ ఉప కేంద్రం గోడలు బీటలు బారాయి. పై కప్పు పెచ్చులు ఊడుతున్నాయి.

● రక్షణ కంచె కరువు

మండల కేంద్రంలో రక్షణ కంచె కరువైంది. గతంలో ఏర్పాటు చేసిన కంచె 60శాతానికి పైగా తొలగిపోయింది. దీంతో ఆ ప్రాంతం రైతులు సబ్‌స్టేషన్‌లో నుంచి నడిచి వెలుతున్నారు. ఇప్పటికయిన సంబంధిత శాఖ జిల్లా అధికారులు స్పందించి సమస్యలు తీర్చాలని కోరుతున్నారు.



కుభీర్ సబ్‌స్టేషన్ కార్యాలయం

● ఉన్నతాధికారులకు నివేదిస్తాం

కదం ఆదిత్య విద్యుత్ శాఖ ఏఈ కుభీర్

విద్యుత్ ఉప కేంద్రాల్లో ఉన్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తాము. ప్రస్తుతం పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు కాలేదు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా సేవలందించేందుకు కృషి చేస్తాం.

తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ప్రజావాణి

● నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల విజ్ఞప్తులు ఆమె స్వీకరించారు. రైతు రుణ మాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల అంశాలపై ప్రజలు అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని, శాఖల వారీగా పెండింగ్ సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా సిద్ధం చేయాలని, రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టికి సారించాలని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా సిద్ధం చేయాలని, రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన మరమ్మతులు చేపట్టి సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులంతా సమయపాలన పాటించాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన టెలిఫోన్ ప్రజావాణిలో 91005 77132 నంబర్‌కు కాల్ చేసి ప్రజలు తమ సమస్యలు తెలియజేయాలని, వాట్సాప్ ద్వారా దరఖాస్తులు పంప వచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన


క్రికెట్ ఆడుతున్న ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : వేసవి లో పిల్లలు చేడు వ్యసనాలు, ఫోన్, టీవీలకు అలవాటు పడకుండా తమ వంతు బాధ్యతగా వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన అన్నారు. సోమవారం ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో పోలీస్ సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. ఆయా క్రీడాలతోపాటు యోగా తదితర వాటిని ఇక్కడ శిక్షణ అందించనున్నారు. విద్యార్థు లను ఎస్పీ పరిచయం చేసుకొని వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. తాను చిన్నప్పుడు కూడా వేసవి సేలవుల్లో అల్లరి చేసేవాడని తెలిపారు. కానీ అప్పటి పరిస్థితులు ఇప్పటి పరిస్థితులు వేరన్నారు. ప్రస్తుతం మారుతున్న కాలనీకి పిల్లలు కూడా ఫోన్, టీవీ, చేడు వ్యసనాల భారిన పడుతున్నారన్నారు. ఇటీవల ఓ కాలనీలో వెళ్లే చిన్న పిల్లలు గంజాయి, మందు తాగుతూ కనిపించారన్నారు. విద్యార్థులు, పిల్లలు వేసవిలో సమయం వృథా చేయకుండా ఆటలవైపు మనసును మల్లించాలన్నారు. లేదా మంచి అలవాట్లను నేర్చుకోవాలన్నారు. ఆటల ద్వారా శారీర ధారుఢ్యంతో పాటు మానసికంగా ధృడంగా ఉంటారన్నారు. ఈ శిబిరంలో ఆటలతో పాటు పోలీసుల పనితీరు, ఆయుధాల వినియోగం, జైళ తదితర వాటి గురించి వివరిస్తామన్నారు. చివరి రోజు శిబిరంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, సీఐ కరుణకర్, ఆర్‌ఐలు వెంకటి, చంద్రశేఖర్, కరాటే మాస్టర్ ప్రవీణ్, యోగ మాస్టర్, పీఈటీ సందీప్ పాల్గొన్నారు.

నూతన ఎస్సైకి నాయకుల సన్మానం

బీంపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): బీంపూర్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన పీర్‌సింగ్ నాయక్‌ను సోమవారం వివిధ పార్టీల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో అందరూ సహకరించాలని కోరారు. దేశీదారు, గంజాయి, ఇసుక అక్రమ రవాణా లాంటిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుడిమేత సంతోష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాముస్ అశోక్, నాయకులు దాసరి రమేష్, మాడవి లింబాజీ, షేక్ ఖరీం, దండే సుదర్శన్, రవీందర్ జాదవ్, రామేశ్వర్, సోనేరావు, ప్రభాకర్, మనోజ్, మేకల ప్రవీణ్, తోకల అశోక్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు


కుమురం భీమ్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఉన్నత విద్యపై అవగాహన సదస్సు

నార్నూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): గాదిగూడ మండల ప్రాంత పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మండల కేంద్రంలోని ఆర్యబట్ట స్కూల్‌లో గురువారం ఉన్నత విద్యపై అవగాహన సదస్సు, ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్విస్తున్నట్లుగా ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పెందుర్ సంతోష్ అన్నారు. సోమవారం కొమురం భీమ్ చౌక వద్ద ఆదివాసీ సంఘం నాయకులు కలిసి మాట్లాడారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారి వెంట గంగారాం, శంభు, ప్రభాకర్, లింగు పాల్గొన్నారు.

మతం మారిన వారి పాత కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయండి

● తహసీల్దార్ కార్యాలయంలో బుడగ జంగం సంఘం వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఖానాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మతం మారిన వారి పాత కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేసి సదరు మతానికి వర్తించే ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని సుర్జాపూర్ గ్రామానికి చెందిన బుడగ జంగం సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుజాతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ... కొంతమంది హిందూ మతం నుంచి ఇతర మతంలోకి మారినప్పటికీ పాత కుల ధ్రువీకరణ పత్రాలను కొనసాగిస్తూ ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధి పొందుతున్నారన్నారు. ఇలాంటి వారి వలన నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలా ఇతర మతంలోకి మారి పాత కుల ధ్రువీకరణ పత్రాలను ప్రస్తుతం ఉపయోగిస్తున్న వారి వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేసినట్లు పేర్కొన్నారు. వెంటనే వారి పట్ల విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మతం మారిన తర్వాత కూడా ఇప్పటి వరకు పాత మతం తాలూకు కుల ధ్రువీకరణ పత్రాలతో పొందిన ప్రభుత్వ పథకాలను ప్రభుత్వం రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుర్జాపూర్ బుడగ జంగం సంఘం సభ్యులు దుర్గయ్య, ఆకుల సాయన్న, గంధం రాజు, కడమంచి లక్ష్మణ్, సునీల్, శివప్రసాద్, గంగాధర్, రవీందర్, జెట్టి వెంకటేష్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సభ్యులు కాశవేణి ప్రణయ్, చంద్రశేఖర్, లోకేష్, రాజశేఖర్, బజరంగ్ దళ్ కార్యకర్తలు, తదితరులున్నారు.

'ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా హమాలీలు డబ్బులు దండుకుంటున్నారు'

బోథ్, మే 5 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో జొన్నల చేస్తున్న హమాలీలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని పొచ్చెర గ్రామానికి చెందిన రైతు రమణారెడ్డి సోమవారం సాయంత్రం మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతు హమాలీలకు చెల్లించే రేటు క్వింటాల్‌కు 38 రూపాయలు కాగా 50 రూపాయలు వసూలు చేస్తున్నారని రైతు ఫిర్యాదు చేశారు. అంతేగాక తూకం వేస్తున్న సమయంలో కింద పడ్డ జొన్నలను హమాలీలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. దీంతో మార్కెట్ కమిటీ సెక్రటరీ చైర్మన్‌తో పాటు సహకార సంఘం డైరెక్టర్ రాజు యాదవ్ హమాలీలతో మాట్లాడారు. ఇష్టానుసారంగా హమాలీలు కూలీ డబ్బులు వసూలు చేయవద్దని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. దీంతో హమాలీలు తమకు కూలీ గిట్టుబాటు కాదని పేర్కొనగా రైతులు సంతోషంగా ఇస్తే తీసుకోవాలి తప్ప బలవంతంగా వసూలు చేయరాదని చైర్మన్ సెక్రటరీలు పేర్కొన్నారు. అన్ని మార్కెట్ యార్డులలో హమాలీలు 38 రూపాయలు క్వింటాలుకు తూకం వేసినందుకు తీసుకుంటుంటే ఇక్కడ మాత్రం హమాలీలు ఇష్టానుసారంగా డబ్బులు దండుకుంటున్నారని రైతులు పేర్కొంటున్నారు. దీంతో ఎక్కువ డబ్బులు తీసుకుంటున్న హమాలీలను సమస్య పరిష్కారం అయ్యేంతవరకు తూకం వేయవద్దని ఆదేశించడంతో కూలీలు తిరిగి వెళ్లిపోయారు.

రైతులు ఇష్ట ప్రకారం ఇస్తేనే డబ్బులు తీసుకుంటున్నాం

బోథ్, మే 5 (ఆంధ్రజ్యోతి): తాము గత పది సంవత్సరాల కాలంలో మార్కెట్ యార్డులో హమాలీ పనిచేస్తున్నామని అయితే తాము ఎక్కువ డబ్బులు తీసుకుంటూ దోపిడీ చేస్తున్నామని ఆరోపణలు చేయడం సరైనది కాదని బోథ్ మార్కెట్ హమాలీలు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ తాము రైతుల అదృష్టం మేరకు నడుచుకుంటున్నామని కావాలని తమను మార్కెట్ కమిటీ చైర్మన్ కార్యదర్శిలు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అయితే రానున్న రోజుల్లో పంట తూకం వేయడానికి ఇతర ప్రాంతాల నుండి హమాలీలను తీసుకువస్తే అడ్డుకుంటామని పేర్కొన్నారు. కాగా కొంతమంది రైతులు ధర నిర్ణయించే సమయంలో రైతు సంఘాల ప్రతినిధుల సమక్షంలో ధర నిర్ణయించాలని పేర్కొంటున్నారు.

అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీయులను గుర్తించి

బయటకు పంపించి వేయాలి

● బీజేపీ భైంసా పట్టణ, మండల శాఖల డిమాండ్ ● తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాల అందజేత

భైంసా, మే 5 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులను గుర్తించి వెంటనే వారందరిని దేశం బయటకి పంపించే చర్యలు చేపట్టాలని భైంసా పట్టణ, మండల బీజేపీ శాఖలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సంబంధిత విషయంలో బీజేపీ ముథోల్ నియోజక వర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, భైంసా పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు రావుల రాము, సిరం సుష్మారెడ్డిలు ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వీరు ముగ్గురు మాట్లాడుతూ గత నెలలో జమ్ముకశ్మీర్‌లోని పహాల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి వెనుక పాకిస్తాన్ ప్రమేయం ఉందని ఆరోపించారు. దేశంలో చోటు చేసుకుంటున్న ప్రతి ఉగ్రమూక చర్య వెనుక పాక్తిస్తాన్ హస్తం ఉంటోందన్నారు. ఉగ్రవాదులకు ఉతమిస్తున్న పాకిస్తానీయులను వెంటనే భారత్ నుంచి బయటకి పంపించి వేయాలన్నారు. ఇదే క్రమంలో భైంసా డివిజన్ పరిధిలో సైతం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అక్రమంగా నివస్తున్న పాకిస్తానీయులను గుర్తించి వెంటనే తరలించి వేయాలన్నారు.సంబంధిత ప్రక్రియ నిర్వాహణలో జాప్యపు విధానాలకు తావులేకుండా సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. కూకటివేళ్లతో సహ పెకిలించి వేయాలన్నారు. ఇందులో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎనుపోతుల మల్లేశ్వర్, మున్సిపల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ సిందే కపిల్‌లతో పాటు భైంసా పట్టణ, మండల కార్యవర్గ ప్రతినిధులు, బూత్ కమిటీ అధ్యక్షులు , ప్రధాన నాయకులు పాల్గొన్నారు.


భైంసా తహసీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ ప్రతినిధులు

వేసవి అలవెన్స్‌లు ఏవీ!?

● కూలి డబ్బులూ ఆలస్యమే ● ఉపాధి పనులపై ఆసక్తి చూపని కూలీలు


ఎండలో పని చేస్తున్న కూలీలు

సారంగాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు ఉపాధి కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రోజురోజుకు నీరుగారుతుంది. గతంలో ఉపాధి హామీ కూలీలకు కూలీ డబ్బులు వెనువెంటనే బ్యాంకు ఖాతాలలో జమ అయ్యేవి. ప్రస్తుతం పని చేసిన కూలీలకు డబ్బులు మాత్రం బ్యాంకు ఖాతాలలో జమ కాకపోవడంతో పాటు పనికి తగ్గ కూలీలకు డబ్బులు రాకపోవడంతో ఉపాధిపనులపై కూలీలు అనాసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. వేసవి కాలం వచ్చిందంటే వేసవి భత్యం కింద పరికరాలకు అదనంగా డబ్బులను జమ చేసేది గడ్డపారకు , తాగు నీటి కోసం వేసవి అలవెన్స్‌ల కింద కూలీలకు జమ చేసేది. రెండేళ్ల నుంచి రావడం లేదని కూలీలు పేర్కొంటున్నారు. కనీసం పని చేసే సమయంలో ఏ చిన్న గాయమయిన ఫస్ట్ ఎయిడ్ చేసుకోవడానికి కిట్లు వచ్చేవారని ప్రస్తుతం అవికూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రత దృష్టిలో పెట్టుకొని మజ్జిగను పంపిణీ చేయడం లేదని కూలీలు పేర్కొంటున్నారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు మండుటెండలో పని చేయవల్సి వస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికయిన సంబంధిత అధికారులు, పాలకులు ఉపాధి హామీ కూలీలను దృష్టిలో ఉంచుకొని సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్



ఎత్తిపోతలకు మంచి రోజులు!

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీడు భూములను సాగులోకి తీసుకు వచ్చేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకాలన్నీ ఒకటి రెండు చోట్ల మినహా ఎక్కడ కూడా పనిచేయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల వ్యవస్థపై పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించడం అలాగే నిర్వహణకు, మరమ్మతులకు అవసరమైన నిధులను మంజూరు చేయకపోవడంతో కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ పథకాలన్నీ నిరుపయోగంగా మారిపోయాయి. ఈ పథకాల ద్వారా దాదాపు 45 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యం సైతం నీరుగారి పోతుందంటున్నారు. అలాగే అప్పటి ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల వ్యవస్థను నిర్వహించే ఐడీసీ (ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)ను ఇరిగేషన్ శాఖలో విలీనం చేసింది. దీంతో ఇరిగేషన్‌శాఖ తన పరిధిలోని పథకాల నిర్వహణతో పాటు ఈ ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతను చేపట్టింది. అప్పటికే తీవ్రమైన ఆర్థిక, పనిభారంతో సతమతమవుతున్న ఇరిగేషన్ శాఖకు ఈ ఎత్తిపోతల పథకాల నిర్వహణ మరింత భారమైంది. దీంతో ఆ శాఖ ఇటువైపు ఆశించిన మేర దృష్టి సారించలేకపోయింది. ఈ భారాన్ని మెయలేక ఇరిగేషన్‌శాఖ చేతులెత్తేసింది. దీంతో ఎక్కడికక్కడ ఈ ఎత్తిపోతల పథకాలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయి రైతులకు ఉపయోగపడడం లేదు. ఎత్తిపోతల పథకాలపై గత ప్రభుత్వం నిర్వాహకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతి నిధులు ప్రస్తుతం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ప్రభుత్వం దీనిపై కసరత్తు జరిపి ఎత్తిపోతల పథకాలన్నింటినీ ఇరిగేషన్ నుంచి తప్పించేందుకు నిర్ణయించింది. తిరిగి ఐడీసీని పునరుద్ధరించి ఆ సంస్థ పరిధిలోకి ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతలను తీసుకురానున్నారు. అలాగే ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కూడా మంజూరు చేసేందు కు సిద్ధమవుతున్న కారణంగా ఇక ఈ పథకాలకు మహర్దశ పట్టబోనుందంటున్నారు.



లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

● ఉమ్మడి జిల్లాలో 68 పథకాలు

ఐడీసీ పరిధిలో మొదటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 68 ఎత్తిపోతల పథకాలు నిర్మించగా ఇందులో నుంచి 80 శాతంకు పైగా పథకాలు పనిచేయడం లేదన్న ఫిర్యాదులున్నాయి. సంబంధిత శాఖ అధికారుల నిర్వాకం కారణంగానే కాకుండా రైతుల అవగాహన లోపం, నిధుల కొరత ఈ పథకాల నిర్వహణకు సమస్యగా మారిందన్న వాదనలు ఉన్నాయి. ముఖ్యంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎత్తిపోతల పథకాల నిర్వహణకు సంబంధించి నిధులు విడుదల చేయకపోవడం, అలాగే నిర్వహణపై ప్రత్యేకదృష్టి సారించ కపోవడం ఈ పథకాల నిర్వహణకు శాపంగా మారిందని అంటున్నారు. సంబంధిత ఐడీసీ అధికారుల లెక్కల ప్రకారం మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 68 ఎత్తిపోతల పథకాలు ఉండగా ఇందులో నుంచి నిర్మల్ జిల్లాలో మొత్తం 42 ఎత్తిపోతల పథకాలు ఉన్నట్లు అధికారులు వివరిస్తున్నారు. కాగా జిల్లాలో కేవలం 2 ఎత్తిపోతల పథకాలు పని చేస్తుండగా మరో ఆరు పాక్షికంగా పనిచేస్తున్నాయి. మిగతా 34 ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయన్న విమర్శలున్నాయి. అలాగే మంచిర్యాల జిల్లాలో మొత్తం 13 ఎత్తిపోతల పథకాలకు గాను ఏడు ఎత్తిపోతల పథకాలు పని చేయడం లేదంటున్నారు. కొమరం భీం, ఆసిఫాబాద్ జిల్లాలో ఐదు ఎత్తిపోతల పథకాలు, ఆదిలాబాద్‌లో రెండు ఎత్తిపోతల పథకాలు పనిచేయకుండా నిరుపయోగంగా మారాయి.

● అడుగడుగునా నిర్లక్ష్యం

అయితే అధికారులు చెబుతున్న లెక్కలకు వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయంటున్నారు. అధికారులు చెబుతున్నట్లు పనిచేస్తున్న ఎత్తిపోతల పథకాలలో కూడా అనేక లోపాలున్నట్లు విమర్శలున్నాయి. జలాశయాలు, నదులు, వాగులు ఉన్న ప్రాంతంలో ఈ ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. ముఖ్యంగా

» ఇరిగేషన్ నుంచి తప్పించి మళ్లీ ఐడీసీ పరిధిలోకి పథకాలు
» గత బీఆర్ఎస్ సర్కార్ నిర్లక్ష్యంతో మూతబడ్డ పథకాలు
» నిధుల కొరతతో జిల్లాలో నిలిచిపోయిన మరమ్మతులు
» నీరుగారిన 45 వేల ఎకరాల సాగు లక్ష్యం

గోదావరి పరివాహక ప్రాంతం లోని జలాశయాలను లక్ష్యంగా చేసుకొని నిర్మించిన ఎత్తిపోతల పథకాల ద్వారా వందలాది ఎకరాలకు సాగు నీరును అందించాలన్న లక్ష్యాన్ని నిర్ధారించారు. చాలా చోట్ల ఎత్తిపోతల పథకాలు పూర్తి నిరుపయోగంగా పడిఉన్నాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోతుండడమే సమస్యకు అసలు కారణంగా పేర్కొంటున్నారు. ఇలా నెలల తరబడి ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పరికరాలు, పంపులు, మోటార్లు, పైపులైన్లకు మరమ్మతులు చేయకపోతుండడం ఈ పథకానికి ఆటంకంగా మారుతుంది. అప్పటి ప్రభుత్వం ఓవైపు ఇరిగేషన్ రంగానికి కోట్లాది రూపాయలు మంజూరు చేసినట్లు ప్రకటించినప్పటికీ ఎత్తిపోతల పథకాల నిర్వహణ విషయంలో మాత్రం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా మరమ్మతులు, నిర్వహణకు సంబంధించిన నిధుల విడుదల విషయంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏళ్ల నుండి నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న ఫిర్యాదులున్నాయి.

● నిర్మించి ఏళ్లు గడుస్తున్నా రైతులకు అప్పగించలే..

కాగా జిల్లాలోని లోకేశ్వరం మండలం మన్మథ్ గ్రామంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ఇప్పటి వరకు సంబంధిత శాఖ అధికారులు ఆ పథకం పరిధిలోని రైతులకు అప్పగించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ పథకం చెడిపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు ఇప్పటి వరకు పూర్తి కాలేదు. రైతులు చాలాసార్లు అధికారులకు ఈ విషయమై వినతి పత్రాలు అందజేసినప్పటికీ వారిలో స్పందన కనిపించడం లేదంటున్నారు. ఈ పథకం నిరుపయోగంగా మారిందన్న ఆరోపణలున్నాయి.

నిర్మల్, మే 5 (ఆంధ్రజ్యోతి)

సీఐ గోపినాథ్, ఎస్సై శ్రీకాంత్‌కు..

తెలంగాణ పోలీసు రియల్ హీరోస్ అవార్డు

● హైదరాబాద్‌లో అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి



భైంసా సీఐ గోపినాథ్‌కు అవార్డు అందజేస్తున్న సీఎం

భైంసా, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇద్దరు పోలీసు అధికారులకు తెలంగాణ పోలీసు రియల్ హీరోస్ అవార్డు దక్కింది. గతేడు జిల్లాలోని మహబూబ్‌ఘాట్ వద్దజరిగిన రోడ్డు ప్రమాదంలో చిక్కుకున్న ముగ్గురిని ప్రాణాలకు తెగించి కాపాడిన భైంసా టౌన్ సీఐ గోపినాథ్, సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్‌కు ఈ అరుదైన గౌరవం దక్కింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వీరిద్దరూ అవార్డులు అందుకున్నారు. గతేడు జిల్లాలోని మహబూబ్‌ఘాట్ వద్ద అర్ధరాత్రి వేళ జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురిని గోపినాథ్, శ్రీకాంత్‌లు ప్రాణాలకు తెగించి కాపాడారు. జోరున వర్షం కురుస్తుండగా.. పాతిక మీటర్ల మేర లోయలో పడి కారులో చిక్కుకున్న ముగ్గురిని టార్చ్‌లైట్, సెల్‌ఫోన్ వెలుగుల్లో సీఐ గోపినాథ్, ఎస్సై శ్రీకాంత్‌లు తమ సిబ్బంది సహకారంతో ప్రాణాలకు తెగించి కాపాడారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ధైర్య సాహసాలతో ముగ్గురిని కాపాడినందుకు తెలంగాణ పోలీసు రియల్ హీరోస్ అవార్డు సత్కారం దక్కింది. ఓ మీడియా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరూ సీఎం చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. కాగా.. అవార్డు అందుకున్న గోపినాథ్, శ్రీకాంత్‌ను జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

జిల్లాలో కంపించిన భూమి

● ఖానాపూర్‌లో భయంతో రోడ్లపై పరుగులు తీసిన జనం



ఖానాపూర్‌లో రోడ్లపైకి వచ్చిన జనం

నిర్మల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భూమి ఒక్కసారిగా కంపించింది. ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్‌నగర్, విద్యానగర్, శాంతినగర్ కాలనీతో పాటు మండలంలోని మస్కాపూర్, తర్లపాడ్ గ్రామాల్లో భూమి కంపించింది. అలాగే కడెంలోనూ 2 సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు భూకంపం భయంతో ఒక్కసారిగా రోడ్ల పైకి పరుగులు తీశారు. మరోవైపు.. రాత్రివేళ తిరిగి భూమి కంపిస్తుందేమోనన్న భయంతో జనం ఇళ్లలోకి వెళ్లకుండా రోడ్ల పైనే పడిగాపులు కాస్తున్నారు.

కదిలి లొద్దిలో భక్తుల సందడి



కదలి పాపహరేశ్వర స్వామివారికి అభిషేక పూజలు చేస్తున్న భక్తులు

దిలావర్‌పూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కదిలి లొద్దిలో వెలసిన శ్రీ పాపహరేశ్వరస్వామి సన్నిధి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. మండు వేసవిలో స్వామివారి చెంతన ఉన్న చల్లని చెట్ల కింద సేద దీరారు. స్వామివారి గోముఖ గుండంలో పవిత్ర స్నానాలు చేశారు. శ్రీ మాతాన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకుని మహిళా భక్తులు కుంకుమార్చన పూజలు చేశారు. సత్యనారాయణ వ్రతాలు చేశారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. నిత్యాన్న సత్రంలో భక్తులు చల్లని మంచినీరు, అన్నప్రసాద వితరణ చేశారు.

వినతులు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించిన ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ ముఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను జిల్లా ఎస్పీ జానకీ షర్మిల స్వీకరించారు. అనంతరం సమస్యలను విన్న వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. సుదూర ప్రాంతాల ఫిర్యాదుదారులు జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకోలేని వారు మెసేజ్ యువర్ ఎస్పీ కార్యాక్రమంలో భాగంగా 87126 59599 నెంబర్‌కి వాట్సాప్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

కుస్లీలో గొర్రెపై చిరుత దాడి

నర్సాపూర్(జి), మే 5 (ఆంధ్రజ్యోతి) : చిరుత దాడిలో గొర్రె గాయపడ్డ సంఘటన కుస్లీ గ్రామశివారులో చోటుచేసుకుంది. యజమాని సాయినాథ్ మాట్లాడుతూ... అడవి వైపు నుంచి చిరుతపులి ఒక్కసారిగా వ్యవసాయ భూమిలో మేత మేస్తున్న గొర్రెల మందలోకి వచ్చి గొర్రెపై దాడి చేసిందని తెలిపారు. పశువుల కాపరి అరవడంతో చిరుత అడవిలోకి వెళ్లిందని తెలిపారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సాయరెడ్డి, అలేఖ్య మాట్లాడుతూ.. గ్రామస్థులు, పశువుల కాపర్లు అడవిలోకి వెళ్లవద్దని సూచించారు.

'తహసీల్దార్ భవన నిర్మాణాన్ని త్వరలో ప్రారంభిస్తాం'



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కుభీర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న స్థలంలో తహసీల్దార్ నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు ఆర్ అండ్ బీ డీఈ సునీల్ అన్నారు. సోమవారం నిర్మించే స్థలాన్ని పరిశీలించి సర్వేయర్‌లో కొలతలు తీసుకొని హద్దులు గుర్తించారు. భవన నిర్మాణం కోసం ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 50లక్షలు మంజూరు చేసిందని అన్నారు. అన్ని హంగులతో కూడిన భవ నిర్మాణం నాణ్యత ప్రమాణాలతో చేపడతామన్నారు. ఆయన వెంట ఏఈ విశాల్, గిర్ధావార్ నరేష్ తదితరులున్నారు.

భూ భారతిని సద్వినియోగం చేసుకోండి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఓలాలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్



దరఖాస్తును స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

కుంటాల, మే, 5 : (ఆంధ్రజ్యోతి) : భూ భారతి పథకాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కుంటాల మండలం పైలట్ ప్రాజెక్టులో భాగంగా భూ భారతి పథకానికి ఎంపికైనందున సోమవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు కుంటాల మండలంలోని ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల యొక్క భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని ఇందులో భాగంగానే సోమవారం రోజు మండలంలోని రాయపాడ్, మెదన్‌పూర్, ఓలా గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఓలా గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సంబంధించిన అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ భూ భారతి పథకాన్ని ప్రవేశపెట్టిందని, గతంలో ధరణి పోర్టల్‌లో రైతుల యొక్క పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలన్నీ పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ భూ భారతి పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. రాబోయే రోజుల్లో భూ భారతి పథకంతో రైతులకు ఎలాంటి భూ సమస్యలు ఉండవన్నారు. రైతుల వ్యవసాయ భూములకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఈ సదస్సులో తమ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆ తర్వాత తమ సిబ్బంది గ్రామంలో దరఖాస్తును అన్ని విధాలుగా పరిశీలించి అనంతరం సమస్య పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మూడు గ్రామాలలో కలిపి సోమవారం 65 మంది రైతుల నుండి భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సదస్సులో భూ రికార్డులలో విస్తీర్ణం, పేరు లోపాలు, వారసత్వ భూములు, భూ స్వభావం, నిషేధిత జాబితాలోని భూముల సర్వేనెంబర్ల లోపాలు, పట్టాపాసు బుక్ లేని భూములు, సాదా బైనామాలు, హద్దుల సమస్యలు, పార్ట్ బి భూములు, భూసేకరణ కేసులపై దరఖాస్తులు స్వీకరించిన నూతన ఆర్‌వోఆర్ ప్రకారం విచారణ జరిపి పరిష్కరిస్తామన్నారు. వివిధ కారణాల వల్ల ఈ సదస్సులో దరఖాస్తు సమర్పించలేని వారు తర్వాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. క్షేత్రస్థాయిలో వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్, హెల్ప్‌డెస్క్, జనరల్‌డెస్క్‌ల ఏర్పాటును కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి తహసీల్దార్‌ల దృష్టికి తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్‌లు ఎజాజ్ అహ్మద్‌ఖాన్, కమల్‌సింగ్, ప్రవీణ్‌కుమార్, డీటీ నరేష్‌గౌడ్‌తో పాటు పలువురు రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

నిర్మల్ అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన భూ భారతి చట్టం (ఆర్‌వోఆర్ చట్టం - 2025) ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లోని రైతువేదికలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని రూపొందించిందని, ఈ చట్టం అమలుతో ధరణి చట్టానికి ముందున్న సాదా బైనమా ప్రక్రియ తిరిగి వినియోగంలోకి రానుందని తెలిపారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండానే తహసీల్దార్ స్థాయిలోనే సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. నూతన చట్టం ప్రకారం భూ సమస్యలపై ప్రజలు దరఖాస్తు చేస్తే, సంబంధిత అధికారులు నిర్ణీత గడువులోగా విచారించి పరిష్కార చర్యలు చేపడతారని పేర్కొన్నారు. నేటి నుంచి కుంటాల మండలంలో గ్రామరెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయని, ప్రజల నుంచి భూ సంబంధిత దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు.

అనంతరం సదస్సులో పాల్గొన్న ప్రజలు, రైతులు సమస్యలను కలెక్టర్ స్వయంగా విని పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి సందీప్‌కుమార్, తహసీల్దార్ రాజు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఎన్నారై అడ్వైజరీ కమిటీ సభ్యులు

నిర్మల్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే అనిల్ ఈరవత్రి అన్నారు. ఇటీవల ప్రభుత్వం నియమించిన ఎన్నారై అడ్వైజరీ కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డిని సోమవారం ఉదయం ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి ఆధ్వర్యంలో కమిటీ చైర్మన్ అంబాసిడర్ డా. బీఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీమ్‌రెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస్ రావు, గుగ్గిల్ల రవి గౌడ్, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల సీఎంను కలిశారు. సమగ్ర ఎన్నారై పాలసీతో కూడిన గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయడానికి తమ కమిటీ అధ్యయనం చేసి నివేదిక తయారు చేస్తుందని డా. వినోద్ అన్నారు.

నేడు కడెంకు జిల్లా కలెక్టర్ రాక

కడెం, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దూర్ రైతువేదికలో నిర్వహించే భూ భారతి అవగాహన సదస్సుకు మంగళవారం జిల్లా కలెక్టర్ హాజరవుతున్నారని కడెం తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు.

'పట్టా పాస్ పుస్తకం ఇవ్వండి'

నర్సాపూర్(జి), మే 5 (ఆంధ్రజ్యోతి) : సర్వేనెంబర్ 667/ఈలో గల ఐదు ఎకరాల భూమికి పట్టా పాస్‌బుక్ ఇవ్వాలని గౌడ సంఘం నాయకులు ముష్కం సుదర్శన్‌గౌడ్ తహసీల్దార్ కార్యాలయంలోని ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు.

జొన్న లేప తిని మూడు ఆవులు మృతి



జొన్న లేప తిని మృతి చెందిన ఆవులు



బాధిత రైతు విజయ్

దిలావర్‌పూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాడెగాంలో సోమవారం పులిండ్ల విజయ్ అనే పాడి రైతు కు చెందిన మూడు ఆవులు జొన్న లేప తిని మృత్యువాత పడ్డాయి. వేసవిదృష్ట్యా ఎక్కడా పంటపొలాలు లేక పోవ డంతో గ్రామానికి చెందిన రైతులందరూ తమ పశువులను మేత కోసం వదిలేశారు. అయితే మాడెగాం అనుబంధ గ్రామమైన కదిలి శివారులో ఇంతకు ముందే జొన్నసాగు చేసిన పంటచేనులో లేలేత లేప ఆకులను తిన్న మూడు ఆవులు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. నడుస్తూనే కుప్పకూలి మృతి చెందాయి. మృతి చెందిన ఆవులకు దిలావర్‌పూర్ మండల పశు వైద్యుడు డా. విజయ్ పోస్టుమార్టం నిర్వహించారు. కాగా ఒకే రైతుకు చెందిన మూడు ఆవులు మృత్యువాత పడటం, బాధిత రైతు మృతి చెందిన ఆవుల వద్ద చిన్న పిల్లాడిలా రోదించడం తోటి రైతులను కలచి వేసింది. మృతి చెందిన ఆవుల విలువ సుమారు రూ. 95 వేలు ఉంటుందని బాధిత రైతు పులిండ్ల విజయ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ అధికారులు పత్రిక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బాగులవాడ, కస్బా, నిషాన్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కుభీర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

కుభీర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ ఆదిత్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు మరమ్మతులను నిర్వహించనున్నట్లు, ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

పశువుల పాక దగ్ధం

తానూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన గంగాదరోళ్ల నర్సింగ్ పశువుల పాక దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. రైతు, తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం... ఉమ్రి(కే) గ్రామంలో రోడ్డు పక్కన గల రైతులు తమ చేనులో పత్తి కట్టెల కుప్పలకు నిప్పు పెట్టడం వలన సాయంత్రం 7 నుంచి 8 గంటల మధ్యన విపరీతంగా గాలి వీయడం వలన నిప్పురవ్వలు గాలి ద్వారా ఎగిసి పడి రైతు నర్సింగ్ పశువుల రేకుల షెడ్డు వద్ద పశువుల మేతకై నిల్వ ఉంచిన మొక్కజొన్న చొప్ప, తొగరి కర్రలు షెడ్డు ముందు ఉంచబడిన పశువుల దానా, ఎడ్ల బండికి నిప్పు అంటుకోవడం వలన మంటలు చెలరేగి దగ్ధం అయ్యాయి. రైతు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సకాలంలో వచ్చి మంటలను ఆర్పివేశారు. ఎలాంటి ప్రాణ నష్టం, పశువుల నష్టం జరగలేదు. ఈ అగ్ని ప్రమాదం జరగడం వలన మొక్కజొన్న చొప్ప, వ్యవసాయ పనిముట్లు పూర్తిగా దగ్ధం అవ్వడం వలన సుమారు ఆస్తి నష్టం 40వేలు జరిగినట్లు తహసీల్దార్ లింగమూర్తి తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఆస్తి నష్టం వచ్చేలా చూడాలని రైతు కోరారు.